

వివరాలు మెయిన్‌లో

సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి


# ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 12 సెప్టెంబరు , 2026 | పేజీలు :7


## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం

# నేటి తరానికి ఆదర్శం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

### అమరజీవి అనుమాల లింగయ్య పార్టీకి చేసిన సేవలు అమోఘం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటము నిస్వార్థంగా చేసిన పోరాటంఅని, సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాలలో చేర్చి బావి తరాలకు అందించాల్సిన అవసరం ఉన్నదని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నేటి తరానికి ఆదర్శమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 80వ వార్షికోత్సవాల సందర్భంగా సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను మండలంలోని పొనుగోడు గ్రామంలో నిర్వహించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పొనుగోడు గ్రామ మాజీ సర్పంచ్, తన అస్తిలో కుమారుడితో సమానంగా పార్టీకి ఆస్తిని పంచి ఇచ్చిన మహామనిషి అనుమాల లింగయ్య స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నైజం నవాబ్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు చరిత్రత్మకమైన పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని అన్నారు. 225 సంవత్సరాల పాటు హైద్రాబాద్ సంస్థానాన్ని నిజాం నవాబ్ పరిపాలన చేసినారని, మీర్



ఉస్మాన్ అలీఖాన్ పాలనలో హైద్రాబాద్ సంస్థానంలోని ప్రజలపై వేధింపులు, పన్నులపై పన్నులు వేసినారని, మహిళలను చిత్ర హింసలకు గురిచేశారని అన్నారు. ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో ప్రజలు గ్రామాల్లో సంఘం ఏర్పా టు చేసుకుని ప్రజలను చైతన్యం చేస్తూ ముం దుకు సాగినారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. 4వేల మంది కమ్యూనిస్టులు ఆ పోరాటంలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం వల్ల దేశ వ్యాప్తంగా ఉన్న అనేక సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసినారని ఆయన అన్నా రు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపాల వద్ద పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సి ల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, బిల్లా కనకయ్య, ఎడ్ల అంజిరెడ్డి, వేశాల ఆంజనేయులు, కుందురు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, రంగాపురం సర్పంచ్ కట్టా కళ్యాణి, ప్రతాని సైదులు, వెంకన్న, వెంకటేశ్వరరావు, కుంభం వెంకటి, రెడపంగు సైదులు, పగడాల శ్రీనివాస్, పంగ గోవింద్, ఈశ్వరచారి పాల్గొన్నారు.

## బాలిక ఆత్మహత్య.. నిందితుల అరెస్టుకు డిమాండ్

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక వరికుప్పల మౌనిక (17) ఈ నెల 2న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు.బాలిక ఆత్మహత్యకు కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మర్రిగూడ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.అదే గ్రామానికి చెందిన ఏర్పుల రాకేష్,దామెర శివ వేధింపులకు గురి చేయడం వల్లే మౌనిక ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.బాలిక రాసిన లేఖను సైతం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుతో పాటు అందజేసినట్లు తెలిపారు. బాలిక ఆత్మహత్య చేసుకున్న రోజే ఆమె తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకుని బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై ఆందోళనకారులతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నాను విరమించారు.



# 12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు ప్రచార కార్యక్రమం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ 2026 కార్యక్రమంలో భాగంగా ఈనెల 12, 13 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక ఓటరు జాబితాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ రెండు రోజుల పాటు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బిఎల్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు సంబంధించి ఫారం 6, 7, 8లతో పాటు డిక్లరేషన్ ఫారాలు పోలింగ్ కేంద్రాల్లో సేకరిస్తారని వివరించారు. ప్రతి ఓటరు సమీపంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి సర్ 2026 డ్రాఫ్ట్ నోటిఫికేషన్, ఏఎస్‌డిడి జాబితాలో తమ పేర్లు సరైన వివరాలతో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం 6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం 7, చిరునామా, పేర్ల సవరణలకు ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ లేదా అనోమలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లు వాటిని నిర్లక్ష్యం చేయకుండా బిఎల్‌ఓలకు అవసరమైన ఆధార పత్రాలు అందజేయాలని స్పష్టం చేశారు. సందేహాలు ఉన్న ఓటర్లకు ప్రక్రియను వివరించి సహకరించాల్సిందిగా బిఎల్‌ఓలను ఆదేశించినట్లు చెప్పారు. తేది.01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న లేదా ఆ తేదీ నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న అర్హత కలిగిన యువత తమ పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవాలన్నారు. పేరు నమోదు కాకపోతే ఫారమ్ 6 తో పాటు వాంగ్మూలం సమర్పించడం ద్వారా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్‌ఓ ప్రేమ్ రాజ్, ఎలక్షన్ సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రణధీర్ పాల్గొన్నారు.

**ఆయుష్ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి**

ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఆయుర్వేదం, యునాని, హోమియోపతి తదితర ఆయుష్ వైద్య విధానాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ఆయుష్ వైద్య విధానాల్లో భాగంగా ఔషధ చికిత్సతో పాటు పంచకర్మ వంటి సాంప్రదాయ చికిత్సా విధానాలను అవసరమైన సందర్భాల్లో శాస్త్రీయ వైద్య ప్రమాణాల ప్రకారం వినియోగిస్తూ వివిధ రుగ్మతల నివారణ, నియంత్రణకు కృషి చేయాలని ఆయుష్ వైద్యులకు సూచించారు.

**ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వేగవంతం చేయాలి**

సూర్యాపేట జిల్లాలోని మూడు నియోజక వర్గాలలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం కలెక్టరేట్ విసి హాల్ నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశంలో మాట్లాడుతూ రూ. 200 కోట్ల వ్యయంతో హుజూర్‌నగర్ నియోజక వర్గం గడ్డిపల్లి, కోదాడ నియోజక వర్గం చిలుకూరు, తుంగతుర్తి నియోజక వర్గం తొండలలో మొత్తం 3 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి రూ.600 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయాలని, పనులను నాణ్యత ప్రకారం ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇచ్చిన ఆర్కిటెక్చర్ డిజైన్ ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.



## సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఎదురుగా నిర్మిస్తున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఆ ఏరియా వాసులు ఆందోళన చేపట్టారు. టవర్ నిర్మాణం వల్ల ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ శుక్రవారం కమిషనర్ సతీష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ ఏరియా వాసులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం గణేష్ మండపాల నిర్వాహకులతో ఆయన ముందస్తు అవగాహన సదస్సు నిర్వహించారు. మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, విద్యుత్ సరఫరా, మైక్‌సెట్ల వాడకం, డిజేల విషయంలో ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మట్టి వినాయకులను పూజించి, పర్యావరణాన్ని కాపాడుదామని పినాకిల్ విద్యాసంస్థల అధినేత మదార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా వినాయక చవితి పండుగను పురస్కరించుకుని శుక్రవారం నేరేడుచర్ల పట్టణంలో పినాకిల్ పాఠశాల విద్యార్థులు ప్లాస్టర్ ఆఫ్ ఫారిస్, రసాయన రంగుల విగ్రహాలకు స్వస్తి పలికి, పర్యావరణ హితమైన మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులు స్వయంగా తయారు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లోవోల్టేజి కరెంట్ సమస్యకు పరిష్కారం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పెద్దగూడేం ప్రజల రైతుల లోవోల్టేజి సమస్యకు పరిష్కారం కోసం ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఆ గ్రామ సర్పంచ్ పక్కీరు లతా నర్సిరెడ్డి శుక్రవారం తెలిపారు.కరెంట్ హెచ్చు తగ్గులు వస్తున్న నేపథ్యంలో రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని కొత్తగా ట్రాన్స్ ఫార్మర్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో సాధ్యం అయ్యిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పక్కీరు మల్లారెడ్డి జి యదిరెడ్డి ఉపసర్పంచ్ శేఖర్ రెడ్డి వార్డు సభ్యులు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుల్లో రాణించాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రభుత్వం అందించే సదుపాయాలను వినియోగించుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడిన స్కూల్ యూనిఫామ్ పంపిణీ కార్యక్రమంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలలలో భాగంగా స్కూల్ యూనిఫామ్ లు రెండు జతలు అందించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అని వసతులు ఉన్నాయని అన్నారు. సదుపాయలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయులు బట్టు మధు, టిఎంసి మోప్మా శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిజె సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మండలంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు ముందస్తుగా హుజూర్‌నగర్ పోలీస్ వారి నుండి అనుమతులు పొందాలని పట్టణ ఎస్ఐ చలికంటి నరేష్ అన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపైన ప్రయాణికులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మండపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అవసరాల కోసం మండపాల వద్ద విద్యుత్ అధికారుల అనుమతి పొందాలని, మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, పాటలు పెట్టవద్దని, డిజే సౌండ్ సిస్టమ్‌కు ఎటువంటి అనుమతి లేదన్నారు. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని, మండపాల వద్ద గొడవలు, కొట్లాటాలు జరిగితే పూర్తి బాధ్యత కమిటి వారిదేనన్నారు. పీర్లకొట్టం వద్ద, నిమ్మతోట బజార్‌కు చెందిన 13 మంది ఇరువర్గాల యువకులు మద్య పంచాయతీ జరగడంతో స్థానిక తహసిల్దార్ సమక్షంలో 13 మందిపై బైండోవర్ విధించినట్లు తెలిపారు.

## శివకళ్యాణికి డాక్టరేట్




**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని రామలక్ష్మి పురం గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన కాలతిరిపి పాపయ్య అంజమ్మల కుమార్తె శివ కళ్యాణి డాక్టరేట్ పట్టా పొందారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నెం పాపిరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన కాలతిరిపి శివకళ్యాణి కోదాడలో డిగ్రి పూర్తి చేసి హైదరాబాద్ ఉస్మానియాలో ఎంఏ పిహెచ్‌డి పూర్తి చేసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల చేతుల మీదుగా డాక్టరేట్ పొందడం హర్షించ దగ్గ విషయమన్నారు. పేదరికానికి చదువు అడ్డం కాదని నిరూపించారన్నారు. పట్టుదల ఉంటే విజయం మన సొంతమవుతుందని అనడానికి ఆమె సాధించిన డాక్టరేట్ ఒక నిదర్శమని అభినందించారు. మునుముందు అత్యున్నతమైన శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని గ్రామములోని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి తులసమ్మ కన్నారెడ్డి, గ్రామ పంచాయితీ కార్యవర్గ సభ్యులు, దేవాలయ వైస్ చైర్మన్ నర్సింహా రెడ్డి తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉత్తమ ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మండలంలోని గుడిబండ గ్రామ పంచాయితీలో గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య అధ్యక్షతన రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికైన ఎండి సలీం, జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికైన విమలా కుమారి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గుడిబండ గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయులు ముందుండి గ్రామంలోని ఉన్నత పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమాటి వరప్రసాద్ రెడ్డి, ఇర్లా నరసింహా రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## మానసిక ప్రశాంతత ఆధ్యాత్మికతతోనే సాధ్యం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రతి వ్యక్తి తన జీవితం మానసిక ప్రశాంతతతోగడపాలంటే ఆధ్యాత్మిక చింతనలతో సాధ్యమవుతుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది అన్నారు. ఇటీవల నూతనంగా ప్రారంభమైన శాంతినగర్‌లోని శ్రీదుర్గా మల్లేశ్వర దేవాలయం సందర్శించి శ్రీకనకదుర్గ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద బ్రాహ్మణుల ఆశీర్వచనంతో దేవాలయ ట్రస్టు చైర్మన్ ఉప్పల గురునాథం లక్షాదిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు గుండా రమేష్, వీర్లపాటి వెంకటేశ్వర్లు, గజ్జల రవీందర్, నూనె యుగేందర్, ఉప్పల జనార్ధన్, తల్లాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





## ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాడాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ముదిరాజ్‌ల హక్కుల సాధనకు ముదిరాజ్‌లందరూ ఐక్యంగా పోరాడాలని ముల్కలపల్లి రాంబాబు, లక్క వెంకన్న, కంటు నాగరాజు, శీలం వెంకిలు పిలుపునిచ్చారు. శుక్రవారం ముదిరాజుల హక్కుల సాధనకై అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పట్టణంలోని ముదిరాజ్ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజ్ లను బిసి ఏ లో చేర్చాలని, ముదిరాజ్ కార్పోరేషన్ కు ప్రత్యేకంగా 1000 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పోలీసుల అరెస్టులతో ముదిరాజ్ ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ముదిరాజ్‌ల హక్కుల సాధనకై ప్రతి ఒక్కరు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంటి రవి, ప్రసాద్, లక్ష్మ ణ్, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## పశువైద్యశాల సబ్ సెంటర్‌ని ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండల పరిధిలోని జానలదిన్నె గ్రామ పంచాయతీలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్యశాల సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త తక్కెళ్ల నాగార్జున శుక్రవారం ఒక ప్రకటనలోకోరారు. జానలదిన్నె, పత్తెపురం, వైకుంటాపురం, లాల్‌లక్ష్మి తండా,విజయనగరం, మంగళగూడెం సమీప గ్రామల్లో సుమారు 7వేల నుండి 8వేల వరకు పశువులు ఉన్నాయని అన్నారు. ఈ గ్రామాల రైతులు, పశు పోషకులు తమ జీవనాదారంగా పశుసంపదపై ఆధారపడి ఉన్నారన్నారు. ప్రస్తుతం మా ప్రాంతంలో పశువులకు వైద్య సేవలు అందించడానికి పశువైద్యశాల లేకపోవడంతో, పశువులకు అనారోగ్యం వచ్చినప్పుడు దూర ప్రాంతాలకు తీసుకెళాల్సి వస్తోందన్నారు. దీనివల్ల రైతులకు ఆర్ధికభారం పెరగడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో పశువులకు ప్రాణనష్టం జరుగుతుందని అన్నారు. పశువైద్యశాల సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య సిబ్బందిని, ఔషద సౌకర్యాలను కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు.

## క్రీడల్లో రాణిస్తే గుర్తింపు



**ప్రజాపక్షం/నడిగూడెం:** క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు లభిస్తుందని స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి అన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి జిల్లాస్థాయికి ఎంపిక కావడంతో శుక్రవారం విజేతలను అభినందించారు. మెడల్స్ అందజేసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థులు అండర్14 విభాగంలో కబడ్డీ, కోకో పోటీలకు ప్రథమ బహుమతి సాధించి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా అండర్17 విభాగంలో కోకో, వాలీబాల్ పోటీలలో ప్రథమ బహుమతి సాధించారు. కబడ్డీలో ద్వితీయ బహుమతి సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. క్రీడల్లో రాణించి నైపుణ్యాలను పెంపోందించుకోవాలని ప్రిన్సిపాల్ వాణి అన్నారు. గెలుపు, ఓటమి సహజమని అన్నారు. సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ విజయశ్రీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునిత, పిజికల్ డైరెక్టర్ సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుంకుమార్చన

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రావణ మాసంలో చివరి శుక్రవారం సందర్బంగా కుంకమార్చన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్బంగా మహిళ భక్తులు కుంకుమ అర్చన చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావనిరమేష్ గౌడ్,మాజీ వార్డు సభ్యులు ఉష్కాగుల శ్రీను,గంగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,నాగమణి,ఆలయ కమిటీ సభ్యులు,మహిళలు పాల్గోన్నారు.

# డిసిఎం కు వెనక నుండి ఢీకొన్న బైక్

## ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : డిసిఎం ను వెనక నుండి బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిగా ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి జాతీయ రహదారి65పై పంతంగి టోల్ ప్లాజా వద్ద జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన నోముల దీపక్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.మునగాల మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన చీమ ఉదయ్ హోటల్ పని చేస్తుండగా,అన్నారిగూడెం గ్రామానికి చెందిన దున్నపోతుల శ్రీకాంత్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.ముగ్గురు హైద్రాబాద్‌లోనే రూం అద్దెకు తీసుకుని ఉంటున్నారు.గురువారం స్వగ్రామాలకు ముగ్గురు ఒకే బైక్ మీద హైద్రాబాద్ నుండి బయలుదేరి వెళ్తున్నారు.మార్గ మధ్యలో చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా సమీపంలో ముందు వెళ్తున్న డిసిఎం ను వెనక నుండి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న దీపక్(22) తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.బైక్ వెనక కూర్చున్న శ్రీకాంత్,ఉదయ్‌లు గాయపడ్డారు.టోల్ సిబ్బంది అంబులెన్స్‌లో గాయపడిన ఇద్దరిని చికిత్స కోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శ్రీకాంత్ కు మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ తరలించారు.మృతిచెందిన దీపక్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.మృతుడి తల్లి నోముల నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నర్సిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మన్మథకుమార్ తెలిపారు.

# నిబంధనలకు లోబడి వినాయక చవితి జరుపుకోవాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** నిభందనలకు లోబడి వినాయక చవితి జరుపుకోవాలనీ గణేష్ మంటపాలలో డిజే లకు అనుమతి లేదని ప్రశాంత వాతవరణంలో పండగ చేసుకోవాలని పోచంపల్లి స్టేషన్ హౌజ్ అఫీపర్ ఎస్సై జగన్ పేర్కొన్నారు. పట్టణ, మండల పరిధిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న గణపతి ఉత్సవాలలో నిర్వహాకులదే పూర్తి బాధ్యత అని ఆయన అన్నారు.విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు అనుమతులు తప్పని సరిగా తాసుకోవాలని సూచించారు.ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.విద్యుత్ షార్ట్ షర్క్యూట్ లు అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

# అన్ని దానాల్లో అన్నదానం మిన్న



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని చౌటుప్పల్ ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కాంశెట్టి చంద్రశేఖర్ అన్నారు.శుక్రవారం అమవాస్య సందర్భంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.ప్రతి అమవాస్య రోజున సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తడకమళ్ళ శ్రీనివాస్,నీల సత్యనారయణ,దాచేపల్లి విజయ్,నీల రమేష్,సీతారాములు,సముద్రాల శ్రీను, వికాస్,నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

# సరైన పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** గౌరెల్లి టు కొత్తగూడెం రోడ్డు బాధితులకు సరైన పరిహారం ఇవ్వాలని కోరుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి శుక్రవారం జిల్లా కాంగ్రేస్ నాయకులు పాక మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో వినతి సమర్పించారు.930పి రోడ్డు బాధితులకు వలిగొండ మండల రైతులకు చెల్లించిన నష్ట పరిహారాన్ని తమకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కూడ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.కాగా మండలంలోని రైతులకు కరెంటు కోతల నేపథ్యంలో ఇండస్ట్రీలకు కరెంట్ తగ్గంచివ్యవసాయానికి విద్యుత్ సరఫరా పెంచుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# గణేష్ మండపాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండల పరిధిలో ఏర్పాటు చేసే గణేష్ విగ్రహాల నిర్వాహకులు, ఉత్సవ కమిటి సభ్యులు అందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్ఐ ఎన్. బాలు నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను మండలంలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వారు అందించిన అధికారిక లింక్ ద్వారా తమ మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తీసుకునే భద్రతా చర్యలకు ఉత్సవ కమిటి సభ్యులు, యువత పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

# రోజుకు 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ప్రస్తుతం ఎల్నివో వర్షాభావ పరిస్థితుల్లో ఉన్న కొద్దిపాటి బోరు బావుల కింద రైతులు వేసుకున్న పంటలు సాగు చేసుకుందామంటే రైతులకు కరెంట్ ఇచ్చే సోయి ప్రభుత్వానికి లేదని, రోజుకు కనీసం 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. కోదాడ నియోజక వర్గంలో కరెంట్ కోతలు నివారించాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి ఎస్ఇ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులన్నాయని ఉన్న కొద్దిపాటి బోరు బావుల కింద తిండి గింజల మందం సాగు చేసుకుంటే కరెంట్ కోతలతో వేసుకున్న పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే భరించలేని రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసిన నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. రైతుల పంటలు ఎండిపోతే ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అలాగే రైతులకు ఎన్నెన్ని రోజులు నెలకు ఎన్నిసార్లు ఎప్పుడెప్పుడు కోతలు అయ్యేంత వరకు నీళ్లను విడుదల చేస్తారో క్యాలెండర్‌ను వెంటనే రిలీజ్ చేయాలన్నారు. తీరు మారకపోతే హైవేని దిగ్బందిస్తామని, రైతుల సమన్వయంతో అన్ని సబ్ స్టేషన్లను ముట్టడిస్తామని రైతులపక్షాన రైతుల కోసం బిఆర్ఎస్ ముందుండి పోరాడుతుందన్నారు.

# మద్దిరాల తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రభుత్వ స్థలంలోనే నిర్మించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : మద్దిరాల మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రస్తుత తహశీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న 377 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని గ్రామానికి చెందిన వడ్డాణం యతిరాజారావు, పాల్వాయి పరుశరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. ప్రభుత్వ స్థలం ఉండగా ప్రైవేట్ వెంచర్‌లో నిర్మాణం చేయడం ఏమిటని ప్రశ్నించారు. మద్దిరాల ప్రస్తుత తహశీల్దార్ కార్యాలయం పక్కనే ప్రభుత్వం స్థలం 15 ఎకరాలు ఉందన్నారు. అక్కడ కాకుండా ప్రైవేట్ స్థలంలో ఊరికి 3 కిలో మీటర్ల దూరంలో నిర్మించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ స్థలంలో తహశీల్దార్ కార్యాలయం నిర్మాణం చేయాలని దాని ద్వారా ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. శేతి ఆదిరెడ్డి, ఏలేటి నారాయణరెడ్డి, వంగూరి రాములు, బరపటి ఉపేందర్, కొమ్ము రాములు, లింగయ్య, బత్తుల ఏసోబు, సోమయ్య పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్ఎస్ బిఈ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఐతగాని మహేష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా సూర్యాపేటలో బ్యాంకు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రెండు శనివారాలు సెలవులు ఉండగా, మిగిలిన రెండు శనివారాలను కూడా సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కస్టమర్లకు బ్యాంకు సేవలు సాయంత్రం నాలుగు గంటలకే ముగిసినా, ఉద్యోగులు మాత్రం రాత్రి తొమ్మిది, పది గంటల వరకు విధులు నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈనెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికి కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే దేశవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీల శ్రీనివాస్, రామకృష్ణ, అలీం, శ్రీధర్, నరేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




# విద్యుత్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్** :వినాయక నవరాత్రి ఉత్సవాల్లో విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ట్రాన్స్‌కో చౌటుప్పల్ ఏఈ రాజుల సతీష్ పత్రిక ప్రకటనలో కోరారు.వినాయక మండపాలు,నిమజ్జన మార్గల్లో విద్యుత్ తీగలు అడ్డుగా ఉంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఈ నెల 14న వినాయక చవితికి గణపతి మండపాల ఏర్పాటు సమయంలో విద్యుత్ తీగల కింద ఉండకుండా చూసుకోవాలని తెలిపారు.విద్యుత్ సరఫరా కోసం వినియోగం కోసం నాణ్యమైన వైర్లు,ఎంసిబిలను మాత్రమే ఉపయోగించాలని అన్నారు.వైర్లు మండపం రేకులకు తగలకుండా సరైన గేజ్ ఉన్న వాటినే వినియోగించుకోవాలని తెలిపారు.విగ్రహాల తరలింపు,నిమజ్జనం సమయంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలు,భక్తులు,మండపాల నిర్వాహకులు,విద్యుత్ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# 'చందన'లో వినాయక చవితి వేడుకలు



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చందన స్కూల్‌లో శుక్రవారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు.అధ్యాపక బృందం,విద్యార్థులు బంక మట్టితో వినాయక ప్రతిమలను తయారుచేశారు.కాలుష్యరహితంగా పర్యావరణ పరిరక్షణ కాపాడాలనే సందేశాన్ని ఇచ్చారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అవ్వారు రామేశ్వరి మాట్లాడుతూ పండగలను శాంతియుతంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణానికి హాని కాకుండా జరుపుకోవాలని అన్నారు.మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయడం వల్ల కాలుష్యం కలుషితం కాకుండా ఉంటుందని తెలిపారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఉపాధ్యాయులు కె.స్వప్న, పద్మ,గీత,అర్చన,జగదీశ్వరి,కవిత,జ్యోతి,పూజిత పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుదాం



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైఉందని చౌటుప్పల్ మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు.చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా బాధ్యతాయుతంగా జరుపుకోవల్సిన అవసరాన్ని వివరించారు. రామాలయ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, కాంగ్రెస్ మునిసిపల్ మాజీ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మా,రామాలయ కమిటీ ధర్మకర్తలు ఆవుల యేసు యాదవ్,వర్కాల రవిగౌడ్ పాల్గొన్నారు.

# మిడ్‌వెస్ట్ సంస్థ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : మిడ్ వెస్ట్ లిమిటెడ్ సంస్థ చేపట్టిన సేవలు అభినందనీయమని సర్పంచ్ ధరావత్ బాబ్జీ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మంగలితండ గ్రామ పంచాయితీకి సంస్థ ఫ్రీజర్ బాక్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంస్థ అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అకౌంట్ మేనేజర్ శ్రీనివాస్, హెచ్‌ఆర్ తరుణ్, సైదులు, గ్రామ కార్యదర్శి వెంకటనారాయణ, ఉపసర్పంచ్ ధరావత్ కృష్ణవేణి హనుమంతు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.





## సమన్వయంతో పనిచేయాలి

**ప్రజాపక్షం/చివ్వేంల :** అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారిణి సులోచనరాణి అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, పథకాలపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ చక్రాల సంతోష్ వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలపై నివేదకలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యపై భగ్గుమన్న సర్పంచ్‌లు



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో గ్రామ సర్పంచ్‌లు విద్యుత్ సమస్యపై భగ్గుమన్నారు. గ్రామాలలో కరెంటు సక్రమంగా రాకపోవడంతో రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తాము చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కరెంటు లేకపోవడం వల్ల వ్యవసాయ పంపులు నడవడం లేదన్నారు. పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సక్రమంగా విద్యుత్ సరఫరా చేసి రైతులకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నూతన గృహం నిర్మించి అందజేత

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని కల్మల్‌చెర్వు గ్రామంలో సత్రంలో జీవనం కొనసాగిస్తున్న ఆనాథ తల్లి బిడ్డకు దాత ఏవీరెడ్డి సహాకారంతో నూతన గృహన్ని నిర్మించి శుక్రవారం అందజేశారు. నిరాశయులుగా జీవనం సాగిస్తున్న తల్లిబిడ్డకు సొంతింటి కలను సాకారం చేయడం పట్ల గ్రామస్తులు హార్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ఆర్థికంగా వెనుకబడిన, నిరుపేద కుటుంబాలకు ఆదుకుంటూ వారికి అండగా నిలుస్తున్న ఎవిరెడ్డి సేవలను గ్రామసర్పంచ్ బచ్చలకూర శ్రీను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ వైస్ ఎంపిపి గుత్తికొండ ప్రమీల, వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ కుక్కునురు అంజయ్య, దస్తగిరి, అమరవరపు నాగయ్య, కందుల త్రివేణి, నవీన్, బొల్లగాని వెంకన్న, సపిడి లచ్చిరెడ్డి, వెంకటనారాయణ, సపిడి శంభిరెడ్డి, ధనమూర్తి పాల్గొన్నారు.



# నీట్ విజేత ఇందుకు కొండంత అండ



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** పేదరికం లక్ష్యానికి అడ్డంకి కాదని నిరూపించిన నిరుపేద విద్యార్థిని మామిడి ఇందు కు సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ కొండంత అండగా నిలిచారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన దివ్యాంగ కార్మికుడి కుమార్తె ఇందు అంగవైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రభుత్వ గురుకులంలో చదివి జాతీయ స్థాయి నీట్ పరీక్షలో గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఆమె ఉన్నత చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఎస్‌పి తక్షణమే స్పందించి తన కార్యాలయంలో రూ.20వేల నగదును అందజేసి, సీటు సంపాదించడం పట్ల శాలువాతో సన్మానించి అభినందించారు. ఇందు ప్రతిభ సమాజానికి గర్వకారణమని, భవిష్యత్తు చదువులో ఎలాంటి సమస్య ఎదురైనా పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని కొండంత భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.

# డిజేలకు అనుమతిలేదు



**ప్రజాపక్షం/మునగాల:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటి సభ్యులు ప్రశాంతంగా జరుపుకోవాలని, డిజెలకు ఎలాంటి అనుమతి లేదని మునగాల ఎస్ఐ సంజీవరెడ్డి, ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్ లు అన్నారు. శుక్రవారం మునగాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని ఆయా గ్రామాల ఉత్సవ కమిటి సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలను భక్తిశ్రద్దలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. గణేష్ మండపాలకు తప్పని సరిగా పోలీస్ అనుమతి తీసుకోవడానికి ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలని, మండపాల విద్యుత్ శాఖ, రెవిన్యూ శాఖల అనుమతి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చంద్రశేఖర్, శివ, సతీష్, కావేరి, జ్యోతి పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిపై మండల స్థాయి సమీక్ష




**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడివో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలు, అధికారుల పనితీరుపై సమీక్షించారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజి తదితర మౌలిక సదుపాయాల పరిస్థితిని అధికారులు వివరించారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలను వెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధి నులు వేగవంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిని వివరించారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో మండల అధికారులు, సర్పంచ్‌లు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు రిజిస్ట్రేషన్‌తోనే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయ రంగంలో సాగు నీటి పొదుపు, నేల సారవంతం పెంపొందించడానికి ప్రతి ఒక్క రైతు పంటల మార్పిడి పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఎం.రుషేంద్రమని కోరారు. శుక్రవారం మిర్యాలగూడ రైతువేదిక ప్రాంగణంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్, పంటల మార్పిడి విధానం, వరి పంటను ఆశించే వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయ దారులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. డిజిటల్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ధాన్యం కొనుగోలు సేవలు, పంట రుణాలు, పంట బీమాతో పాటు వివిధ రకాల సేవలు పొందడానికి వీలు కలుగుతుందన్నారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని రైతులు ఎల్లప్పుడూ ఒకే రకమైన పంటపై ఆధారపడకూడదని హితవు పలికారు. పంటల మార్పిడి, వైవిధ్యీకరణ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వినియోగంతో పండే కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, వేరుశనగ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. వీటి ద్వారా నీటి పొదుపు సాధించడంతో పాటు నేల సారం పెరిగి, సాగులో సంభవించే ఆర్థిక నష్టాల భారం తగ్గుతుందన్నారు. వరి పంటను ఆశించే తెగుళ్లు, పురుగుల ఉధృతిని ప్రారంభ దశలోనే గుర్తించి, వ్యవసాయ శాఖ అధికారుల సలహాల మేరకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ (బిటిఎం) గిరి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) మలావత్ రమేష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ప్రేరణ ఉత్సవాలకు ఆదినారాయణ ఎంపిక

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** జాతీయస్థాయి ప్రేరణ ఉత్సవాలకు దేశంలో 20 మందిలో ఒక్కరు మండల పరిధిలోని కల్మల్‌చెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి గుండబోయిన శ్రీరామ్ ఎంపికయ్యారు. వీరి జాతీయ స్థాయి కార్యక్రమం గుజరాత్‌లోని వడ్నాగర్ పట్టణంలోని వెర్నాకులర్ పాఠశాల (ప్రధాని నరేంద్రమోడి చదివిన పాఠశాల) నందు నవంబర్ 15 నుండి 21వ తేదీ వరకు విలువ ఆధారిత కరికులంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించబడును, ఈ ఎంపిక కార్యక్రమం వీరిని కేంద్ర విద్య మంత్రిత్వశాఖ నవంబర్ 2026 జిల్లా స్థాయిలో పరీక్షించడం జరిగింది. నిన్న జిల్లా నోడల్ స్కూల్ నవోదయ ప్రిన్సిపాల్ ఆదినారాయణ ఎంపికను ప్రకటించడం జరిగింది. శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయుడు పిడమర్తి వీరబాబు, ఉపాధ్యాయులు శ్రీరామ్‌ను ఘనంగా సన్మానించారు.

## వరి పొలంలో మోకాళ్లపై నిరసన



**ప్రజాపక్షం/అనంతగిరి:** కొత్తగూడెం మేజర్ కాలువకు నీటిని విడుదల చేసి నాణ్యమైన విద్యుత్ అందించాలని గొంద్రియాల ఉప సర్పంచ్ బండ్ల రమేష్ అన్నారు. ఎండిపోతున్న వరిపొలంలో మోకాళ్ల మీద కూర్చొని దండం పెడుతూ విన్నూత్నమైన నిరసన తెలిపారు. రమేష్ మాట్లాడుతూ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు గత 15 రోజుల నుండి నీళ్లు పోతున్నాయని, కాని కొత్తగూడెం మేజర్ కాలువకు నీళ్లు ఇవ్వకపోవడంపై ఈ కాలువ కింద రైతులు ఏం పాపం చేశారని అన్నారు. ఇప్పటి వరకు ఎకరాకు 20వేల రూపాయల పెట్టుబడి పెట్టామని, విద్యుత్ కోతలతో పొలాలు ఎండిపోతున్నాయని, కొత్తగూడెం మేజర్‌కు నీళ్లు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపడమే కాకుండా ఎండిపోతున్న వరి పొలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జల్ల కరుణ, బండ్ల నరేష్, నేలకుర్తి పుల్లారావు పాల్గొన్నారు.

## విబిజి రాంజీ పథకంపై సమీక్ష



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వల్లాపురం గ్రామంలో విబిజి రాంజీ పథకం కింద చేపట్టాల్సిన పనులపై ఎపీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి పనుల గుర్తింపుపై గ్రామసభలో చర్చించారు. గ్రామ ప్రజల అవసరాలు, స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకుని ఇంకుడు గుంతలు, పంట నీటి కుంటలు, సామాజిక ఇంకుడు గుంతలు, పశువుల కొట్టాలు, సాగునీటి కాల్వల మరమ్మతులు, మరుగుదొడ్లు తదితర పనులను గుర్తించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటి అమలుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ తంగెళ్ల నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ




**ప్రజాపక్షం/డిండి;** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసే కార్యక్రమం శుక్రవారం మండలంలోని వావిలికోల్ గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేర్వాల రజిత జంగారెడ్డి, తహాశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌లు హాజరై ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు, పాలకవర్గం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక (విజిపిపి)పై అవగాహన

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక(విజిపిపి)పై అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు సమవేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి కమలాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపిడివో నర్రవేజన అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు, ఏపిఓ శ్రీనివాస్, ఏపిఎం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి సన్మానం

**ప్రజాపక్షం/గుండాల;** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎడ్యూకేషన్ ఎన్స్పోజర్ విజిట్‌లో భాగంగా ఈనెల 26 నుండి అక్టోబర్ 03వ తేది వరకు ఫిన్లాండ్‌లో జరగనున్న విద్యా క్షేత్ర పర్యటనకు గుండాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల టిజిటి ఫిజిక్స్ ఉపాధ్యాయుడు వరకాల మధుసూధన్‌రావు ఎంపిక కావడంతో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి, రాము ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అధితిగా ఎస్ఐ సైదులు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లో రాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ ఐలయ్య, మహేష్, ఎంఈవో అగ్గిరాములు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భక్త జన సంద్రమైన కాళీ కాలబైరవ క్షేత్రం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో శుక్రవారం అమావాస్య తిథి వేళ శ్రీ కాళీ కాలభైరవ క్షేత్రం భక్త జన సంద్రంగా మారింది. కాళీకా అమ్మవారికి ఆలయ పీఠాధిపతులు శ్రీ కాళీ కాలబైరవ ఉపవాసకులు బ్రహ్మశ్రీ సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో గుప్త మంత్రాల నడుమ ప్రత్యేక తాంత్రిక పూజలు, యజ్ఞాలు నిర్వహించారు. అనంతరం అర్ధరాత్రి వేళ నిర్వహించిన ప్రత్యేక మహా హారతి కార్యక్రమం భక్తులను ఎంతోగానో ఆకట్టుకుందని, ఆలయానికి వచ్చిన భక్తులకు నిత్య అన్నదానంతో పాటు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని కోరుతూ శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో దేవరకొండ తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నర్సింహా మాట్లాడుతూ తెలంగాణ ప్రజల స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం, ఎందరో మహనీయుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఘనంగా వేడుకలు జరపాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రాము, భాస్కర్, వినోద్, అంజయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.



## ఊట్లపల్లి గ్రామవాసికి ఉస్మానియా విశ్వవిద్యాలయ డాక్టరేట్




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన నామని మార్కండేయ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన 85వ స్నాతకోత్సవ వేడుకల్లో ఆయనకు పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేశారు. రసాయన శాస్త్రంలో చేసిన విశేష పరిశోధనలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్ లభించింది,, అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్. నవనీత పర్యవేక్షణలో సింథసిస్ ఆఫ్ నావెల్ హెటెరోసైక్లిక్ కాంపౌండ్స్ అండ్ దేర్ ట్రాన్సిషన్ మెటల్ కాంప్లెక్సెస్ క్యారెక్టరైజేషన్ అండ్ స్టడీ ఆఫ్ బయోలాజికల్ యాక్టివిటీ అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనలో ప్రధానంగా రుథేనియం లోహ సమ్మేళనాల తయారీ, నిర్మాణం, రసాయన లక్షణాలు, వాటి జీవసంబంధిత క్రియాశీలతను అధ్యయనం చేశారు. ఈ హెటెరోసైక్లిక్ సమ్మేళనాల అధ్యయనం ద్వారా భవిష్యత్తులో నూతన ఔషధాల అభివృద్ధికి, క్యాన్సర్ నిరోధక సమ్మేళనాల తయారీకి ఎంతో ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయి. ఊట్లపల్లి గ్రామంలో పాఠశాల విద్య, మిర్యాలగూడలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన మార్కండేయ, పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ పట్టా పొందారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లోని ఎన్‌టిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర సహాయ ఆచార్యుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తెలంగాణ విద్యా రంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని నగర మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిపేర్కొన్నారు.టీచర్స్ డే సందర్భంగా ట్రస్మా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బండారు గార్డెన్ లో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి హాజరై ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను ట్రస్మా ఆధ్వర్యంలో సన్మానించడం అభినందనీయమన్నారు. యాదాద్రి డీఈఓ బొల్లారం భిక్షపతి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు.ఈ వేడుకల్లో పట్టణ పరిధిలోని 65 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,ట్రస్మా రాష్ట్ర నాయకులు కొలనుపాక రవికుమార్,నన్నూరి రామ్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, ముఖ్యముల రామ్ మోహన్, జిల్లా అధ్యక్షులు గాదె రవీందర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి,నాగేంద్ర,టౌన్ అధ్యక్షులు నింబరి రమేష్ రెడ్డి, కార్యదర్శి ఫయాజ్, కోశాధికారి చర్లపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నెక్సనా షోరూమ్‌లో సరికొత్త బాలెనో ఆవిష్కరణ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని ఎన్ఈఎక్స్ పవన్ మోటార్స్ షోరూమ్ లో శుక్రవారం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ది స్టన్నింగ్ న్యూ బాలెనో కారును సి బి హెచ్ సౌత్ జోన్ మేనేజర్ యోగేష్ గుప్తా, రీజనల్ మేనేజర్ గణేష్ దుత్తు ఆనంద్,తో పాటు పవన్ మోటార్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి, టి ఎస్ ఎం ప్రతిక్ గుప్తా కంపెనీ సీసీఓకె రవి రెడ్డి, వీపీ ఎం రవీందర్ లు కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఈఎక్స్ ఏ అంటేనే స్టైల్,టెక్నాలజీ,సోఫిస్టికేషన్. ఈ కొత్త బాలెనోలో అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్,భద్రతా ప్రమాణాలు ఉన్నాయని తెలిపారు. నల్లగొండ వినియోగదారుల నుండి దీనికి అద్భుతమైన స్పందన వస్తుందని ఆశిస్తున్నాము అని అన్నారు.కొత్త బాలెనో డార్క్ బ్లూ,గ్రీన్ షేడ్‌లో ఆకర్షణీయంగా ఉండి, చూపరులను ఎంతగానో ఆకట్టుకుందని ఈ వేడుకకు నెక్సనా సిబ్బంది, వినియోగదారులు,అభిమానులు పెద్ద సంఖ్యలో ధన్యవాదాలు తెలియజేశారు. నూతన బాలెనో టెస్ట్ డ్రైవ్ బుకింగ్స్ నెక్సనా నల్లగొండ పవన్ మోటార్స్ షోరూమ్ లో అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/చండూరు:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబర్ 17ను అధికారంగా నిర్వహించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ చండూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు భూతరాజు శ్రీహరి ఆధ్వర్యంలో శుక్రవారం చండూరు ఆర్డీవో వందనపు శ్రీదేవి, చండూరు తహసీల్దార్ రమాకాంత్ శర్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరువలేని మహోన్నతమైన రోజు అని అన్నారు . నిజాం నిరంకుశ పాలన , రజాకార్ల దురాగతాలు, జమీందారీ జాగీర్దారీ దోపిడి నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రక సందర్భానికి లికించబడిన రోజు సెప్టెంబర్ 17ను అధికారంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం , నాయకులు అన్నెపర్తి యాదగిరి , బోడ ఆంజనేయులు , తడకమళ్ల శ్రీదర్ , రావిరాల శ్రీను, సామ వెంకట్‌రెడ్డి, శ్రీను, శంకర్, అశోక్, గణేష్ , స్వామి , నర్సింహ్మా, రామలింగయ్య , యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## 97 జీవోను వెంటనే రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన 97 జీవో వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ 97 జీవోను తక్షణమే రద్దు చేసి పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీవో 97ను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థులు గత కొంతకాలంగా నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బలోపేతం నెపంతో సాంకేతిక విద్యను అందించే పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డబోయిన సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టులతో బిసిల ఉద్యమాన్ని ఆపలేరు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ జనగణనలో ఓబీసీ కుల గణనను తక్షణమే చేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చలో ఇందిరాపార్క్ దీక్షా కార్యక్రమానికి బయలుదేరుతున్న బీసీ జేఏసీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం మిర్యాలగూడ పట్టణంలో బీసీ జేఏసీ నాయకులను వారి ఇళ్ల వద్దనే అదుపులోకి తీసుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడారు. ఈ ముందస్తు అరెస్టు అయిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బంటు కవిత, ఎస్సీ మహిళా జిల్లా కార్యదర్శి చిత్రం ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారి రమేష్ దీన్‌దయాల్, మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 9 మందికి ఉత్తమ మందిని, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన 13 మందిని పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక చొరవ చూపడం, పాఠశాల మౌళిక సదుపాయల క ల్పనతో పాటు, విద్యార్థుల సంఖ్యను పెంచడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. వారిని ఎంపిడివో, మండల విద్యాధికారి లు ఉత్తమ ఉపాధ్యాయులను ప్రశాంశపత్రంతో పాటు శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఈ కాఈర్యక్రమంలో గోన అనురాధ, జయలక్ష్మి , అన్నపూర్ణ, పప్పుల వీరబాబు, అడిదల వెంకటరెడ్డి, సుల్తాని శంకర్, ఎండి సత్తార్, చెవుల బిక్షం, సత్తూరి బిక్షం, దీపాదేవి, తేజరామ్ పాల్గొన్నారు.





## అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

**ప్రజాపక్షం/నకిరేకల్ :**గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామపంచాయతీ ప్రణాళిక అవగాహనాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీబీజీ గ్రామ్‌జీ పథకంలో భాగంగా వీజీపీపీ కింద ఈ నెల 15 నుండి 19 వరకు అన్ని గ్రామ పంచాయతీలలో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలన్నారు.గ్రామ సభల్లో చర్చించి అభివృద్ధి ప్రణాళికలకు గ్రామస్తుల ఆమోదం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జి.బ్రహ్మచారి,ఎంఈఓ మేక నాగయ్య,ఏపీఓ రమణయ్య,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాధవి,పీఆర్‌ఏఈ శంకర్,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/నూతనకల్ :** ప్రజాప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్లరేషన్ కార్డులు మంజూరు అవుతాయని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. పేదలు సన్న బియ్యం తినాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సునీత, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, ఆయా గ్రామాల సర్పంచులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని చిట్టంపహాడ్ గ్రామంలో స్థానిక సర్పంచ్ కోరే దేవేంద్ర సైదులు తన కూతురు అమృత వర్షిణి పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.యశోద హాస్పిటల్స్, హైదరాబాద్ వారి సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.శిబిరంలో యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణుల బృందం పాల్గొని గ్రామస్తులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు.

## ఓటర్ల నమోదు పరిశీలన

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని పెద్దాపురం,బోయగూడెం గ్రామాల్లోని 284, 285 పోలింగ్ బూత్ కేంద్రాల్లో అనుమానాస్పద ఓటర్ల నమోదుపై అధికారులు దృష్టి సారించారు.శుక్రవారం నాంపల్లి తహసీల్దార్ అంబటి ఆంజనేయులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వాటికి సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు. జాబితాలో ఒకే పేరు పునరావృతం కాకుండా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## మర్రిగూడలో రైతులకు వ్యవసాయ శిక్షణ



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ బి.వేణుగోపాల్ రైతులకు శాస్త్రీయ సూచనలు అందించారు.ముఖ్యంగా పత్తి మరియు పప్పు ధాన్య పంటల్లో సమగ్ర పంట యాజమాన్యం, విత్తన ఎంపిక, విత్తే సమయం, కలుపు యాజమాన్యం, ఎరువుల సమతుల్య వినియోగం,పురుగుతెగుళ్ల నివారణ, తేమ సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విత్తన ఎంపిక,ఎరువుల వాడకం, పురుగుల నివారణ, తేమ సంరక్షణపై సూచనలు ఇచ్చారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలని,ఆకులపై పోషకాల పిచికారీ,అంతరకృషి, మల్చింగ్ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు వేణుగోపాల్, ఎంఏఓ సాహస్, ఏఈవో శ్రీలత, ఏటీఎంఏ జయంతితో పాటు ఎర్రగండ్లపల్లి, అజిలాపురం, ఇతర గ్రామాలకు చెందిన రైతులు బొబ్బల శేఖర్ రెడ్డి,బచ్చనగోని లక్ష్మయ్య, రామిడి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోషణ మాసాన్ని విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం, మన అంగన్వాడీ మన బాధ్యత అనే థీమ్‌తో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని 19వ వార్డు కౌన్సిలర్ ఎర్రమళ్ల దినేష్ పిలుపునిచ్చారు. సీడీపీఓ పి.వేణుగోపాల్ రావు ఆదేశాల మేరకు శుక్రవారం ఇస్లాంపుర సెక్టార్ పరిధిలోని ముత్తిరెడ్డికుంట అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస ఉత్సవాలను నిర్వహించారు. కౌన్సిలర్ దినేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్ల ద్వారా రకరకాల ఆహార పదార్థాల విశిష్టతను, వాటిలోని పోషక విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రెహనా సుల్తానా, ఎ.అంజలీదేవి, బి.నాగమణి, ఆయా సైదమ్మ, హెల్పర్లు హైమావతి, నాగలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతిభను వెలికి తీయడానికి సందేశాత్మక చిత్రాలు



**ప్రజాపక్షం/త్రిపురారం:** గ్రామీణ సహజ సిద్ధమైన ప్రతిభను వెలికి తీయడానికి సందేశాత్మక చిత్రాలు తోడ్పడతాయని అంజనపల్లి సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు (కేవీటీ) అన్నారు.మండలంలోని అంజనపల్లి గ్రామంలో సంకెళ్లు అనే సందేశాత్మక షార్ట్ ఫిలిం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంగా నటీనటులు, టెక్నీషియన్లతో ఇలాంటి మంచి ప్రయత్నం చేయడం సంతోషంగా ఉందని, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మన ఊరిలోనే ఉన్న ప్రతిభకు ఈ షార్ట్ ఫిలిం మంచి వేదిక కానుందని అన్నారు. ఈ చిత్రానికి కథ,ప్రొడ్యూసర్ మట్టపల్లి శ్రీనివాస్,దర్శకుడు శ్రావణ్ కుమార్,కెమెరామెన్ పవన్ కుమార్, విజయ్ వ్యవహరిస్తున్నారు. నటీనటులుగా మట్టపల్లి శ్రీనివాస్,అక్కల స్వామి,జూనియర్ ఉపేంద్ర, రాము, శైలజ,సంధ్య,సుశీల,మధు, వనం శ్రీను, బాలనటుడు శివ,మడుపు కొండలు, సూరి వాసు తదితరులు నటిస్తున్నారు.

## ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్ గార్ కార్యక్రమంలో భాగంగా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక తయారీపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జి.వి.రమేష్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి,ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించి,రాబోయే ఐదు సంవత్సరాలకు ఉపయోగపడే విధంగా సమగ్ర ప్రణాళికను రూపొందించాలని కోరారు. సెప్టెంబర్ 19న గుర్తించిన పనులకు గ్రామసభ ఆమోదం పొంది మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయానికి పంపాలని తెలిపారు.




## 12 గంటలు విద్యుత్ ఇవ్వాలి

**ప్రజాపక్షం/త్రిపురారం:**వ్యవసాయ మోటార్లకు నిరంతరంగా 12 గంటలు విద్యుత్ ఇవ్వాలని జిల్లా మాజీ రైతు బంధు డైరెక్టర్ అనుములు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలో త్రిపురారం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సక్రమంగా సరఫరా కాక పొలాలు ఎండిపోతున్నాయని విద్యుత్ ఎస్సీకి ఫిర్యాదు చేశారు.దీంతో త్రిపురారం విద్యుత్ ఏఈబాలు నాయక్, విద్యుత్ ఎస్సీఆదేశానుసారం పంట పొలాలను పరిశీలించారు.





## విద్యతో పాటు క్రీడలు ముఖ్యం

**ప్రజాపక్షం/నాంపల్లి:** విద్యతో పాటు ఆటల పోటీలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని మండల విద్యాధికారి అజయ్ కుమార్ అన్నారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం పెరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాంశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాంపల్లి, పసునూర్, ముష్టిపల్లి, మోడల్ స్కూల్,కేజీబీవీ,గాంధీజీ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని, ఎంపికైన జాబితాను త్వరలో ప్రకటిస్తామని అన్నారు.కార్యక్రమంలో పీఈటీలు జి. సైదులు,డి.నిర్మల,ఉపాధ్యాయులు బి.దామోదర్ చారి,విష్ణు నారాయణ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధించుకునే వరకు ఉద్యమం ఆగదు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బుల్లెట్ ట్రైన్ రిలే నిరాహార దీక్షలో శుక్రవారం 29వ రోజు సిపిఎం అనుబంధ సంస్థ ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు. ఈ దీక్షను మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మూర్తి ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట పట్టణంతో పాటు జిల్లా మొత్తం బుల్లెట్ ట్రైన్ సాధించుకునే దిశగా ఉద్యమ బాట పట్టారని అన్నారు. ఈ దీక్షలో కళాకారులు వెల్పుల వెంకన్న, బచ్చలకూరి రాంబాబు, యాతాకుల ప్రవీణ్, చిత్రం శ్రీను, పల్లెల రాము, నందిపాటి సతీష్ తదితరులు కూర్చోగా దీక్షకు రమణాచారి, కందుకూరి యాదగిరి, నెమ్మాది వెంకటేశ్వర్లు, చల్లమల్ల నరసింహలు సంఘీభావం తెలిపారు.

## సమన్వయంతో పనిచేస్తూ సమస్యలను పరిష్కరించాలి




**ప్రజాపక్షం/నూతనకల్ :** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ సునీత అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఉందన్నారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని లేనియెడల శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఓ సునీత హెచ్చరించారు. పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిఓ హరిసింగ్, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కేబుల్ దొంగలపై నిఘా పెంచాలి

**ప్రజాపక్షం/వేములపల్లి:** వ్యవసాయ పొలాల వద్ద కరెంటు కేబుల్స్ దొంగిలించే దొంగలపై నిఘా పెట్టాలని వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లుకు బీజేపీ మండల అధ్యక్షుడు పెదమం భరత్ వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వేములపల్లి, బుగ్గబాయిగూడెం, తిమ్మారెడ్డిగూడెం,అన్నపురెడ్డిగూడెం గ్రామాల్లోని వ్యవసాయ పొలాల వద్ద మోటార్ కేబుల్స్ దొంగతనాలు ఎక్కువయ్యాయని అన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో కరెంటు వైర్లు కట్ చేయడం వల్ల నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సాంబమూర్తి, రాష్ట్ర నాయకులు చెల్లమల్ల సీతారామరెడ్డి, సత్యనారాయణ,వెంకన్న, పందిరి భాగ్యమ్మ,బుల్లెద్దు లబయ్య,జాన్ రెడ్డి పాల్గొన్నారు.

# కెఎల్ఐ ద్వారా డిండి ప్రాజెక్టును నింపాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉన్నటు వంటి తరుణంలో రైతుల పంటలను కాపాడేందుకు డిండి ప్రాజెక్టును కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా డిండి ప్రాజెక్టును నింపి ఆయకట్టు రైతుల పంటలను కాపాడేందుకు సాగునీరు అందించాలని బిఆర్ఎస్ దేవరకొండ నియోజక వర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాపక్షం ప్రతినిధితో దేవరకొండలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ ఇప్పటికే డిండి ఆయకట్టు పలు గ్రామాల్లోని రైతుల పంటలు ఎండిపోతున్నాయని రైతుల పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. డిండి ప్రాజెక్టును కేఎల్ఐ ద్వారా వెంటనే నింపి, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు.

# శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలో వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని ఎస్ఐ కె. లింగారెడ్డి తెలిపారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండప నిర్వాహకులు,ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు.వినాయక మండపాల ఏర్పాటుకు ఆన్ లైన్ ద్వారా ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని,మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని, రాత్రి వేళల్లో మండప బాధ్యులు కాపలా ఉండాలని సూచించారు.

# పోషకాహారంపై అవగాహన



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని బుగ్గబాయి గూడెం అంగన్ వాడీ కేంద్రంలో పోషణ మాస కార్యక్రమంలో భాగంగా బాలింతలకు పోషకాహారం పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సూపర్ వైజర్ పరిమి రజని మాట్లాడుతూ గర్భిణీస్త్రీలు, బాలింతలు భోజనంలో చిరుధాన్యాలు,పప్పులు,ఆకుకూరలు,పాలు,గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అప్పుడే పిల్లలు,గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ కే.రోజా, చిన్న పిల్లల తల్లులు,అంగన్ వాడీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నాంపల్లి:** వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం శ్రేయస్కరమని నాంపల్లి సీఐ దూది రాజు తెలిపారు.శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్రిమినల్,సివిల్,బ్యాంక్ రికవరీ కేసుల్లో ఇరువర్గాలు రాజీ పడటం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు.న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని సర్కిల్ పరిధిలోని నాంపల్లి, చింతపల్లి, మర్రిగూడ ప్రాంతాల బాధితులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

# మత్స్య సొసైటీపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** శాలిగౌరారం మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు వెంపటి యాదగిరి, కార్యదర్శి పడాల సైదులు డిమాండ్ చేశారు.శాలిగౌరారం సొసైటీపై బీజేపీ మత్స్యశాఖ కోకన్వీనర్ ఎల్.రమణ తప్పుడు ఆరోపణలు చేస్తూ సంఘాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం జిల్లా మత్స్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సొసైటీ 54 ఏళ్లుగా గంగపుత్రులు, ముదిరాజులు అన్నదమ్ముల్లా కలిసి ఉందని, మూడు నెలల క్రితం జరిగిన సహకార ఎన్నికల్లో తమ ప్యానల్ గెలవగా, ఓడిన వర్గం దీన్ని జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. 15 రోజుల క్రితం ఏడీ,డీఎఫ్‌సీ చైర్మన్,కుల పెద్దల సమక్షంలో జరిగిన సమావేశంలో అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారని తెలిపారు.ఇటీవల ఎల్.రమణ పది మందిని తీసుకొని మత్స్యశాఖ కార్యాలయానికి వెళ్లి తమ పాలకమండలి చెరువును రూ.5 కోట్లకు అమ్మినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.తప్పుడు ప్రచారం చేస్తున్న రమణను బీజేపీ నుండి సస్పెండ్ చేయాలని జిల్లా అధ్యక్షుడిని కోరామని,లేనిపక్షంలో రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొల్లేపల్లి నాగరాజు, డైరెక్టర్లు తెడ్ల బిక్షం, చింతకాయల అంజయ్య, వెంపటి సైదులు, బాకీ దానయ్య, వెంపటి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదానికి మానవతవాదమే విరుగుడు



**ప్రజాపక్షం/నకిరేకల్** :ఉగ్రవాదానికి మానవతవాదమే విరుగుడు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ బెల్లి యాదయ్య అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై ఉగ్రవాదుల దాడికి పాతికేండ్లు నిండిన సందర్భంగా విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం,దానికి ప్రతిగా రాజుకున్న ఇస్లామిక్ ఉగ్రవాదం రెండూ మానవాళి మనుగడకు, ప్రపంచ శాంతికి ఎంతమాత్రం దోహదపడవన్నారు. అమెరికా ఆధిపత్యాన్ని అడ్డుకునే మిషతో ప్రపంచ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇస్లామిక్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో దాదాపు 3 వేల మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.రాజనీతి శాస్త్ర అధ్యాపకులు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు శ్రీనివాసాచారి,శ్రీనివాస్,హరిత,డాక్టర్ శంకర్,నర్సింహాచారి,రవీందర్,ఉపేందర్,మాధురి,ఉదయ్ కుమార్,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికతోనే ప్రగతి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో ప్రగతిపథంలోకి తీసుకురావడమే విబిజి రామ్ జి చట్టం ప్రధాన ఉద్దేశమని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఎంపీపీ మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జూలకంటి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడ మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక (విజిపిపి) తయారీ, నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 19న రెండో గ్రామసభను ఏర్పాటు చేసి గుర్తించిన పనులకు గ్రామసభ ఆమోదం పొందుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మాతంగి రమేష్, మండల వ్యవసాయ అధికారి ఎం. రుషేంద్రమణి, వైద్యాధికారి డాక్టర్ మొయిద్, ఆర్‌డబ్ల్యాఎస్ డిపార్ట్‌మెంట్ ఏఈ మణిదీప్, ఇరిగేషన్ ఏఈ మానస, మండల విద్యాధికారి ధర్మానాయక్, ఏపీఎం దిలీప్ కుమార్, నజీముద్దీన్, క్లస్టర్ టీపీ చారి, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈ నెల 17న నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లా అధికారులను ఆదేశించారు.తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ నెల 17న నల్లగొండ పోలీస్ పరేడ్ మైదానంలో ప్రజా పాలన దినోత్సవం నిర్వహిస్తామని,ముఖ్య అతిథి సందేశం కోసం అన్ని శాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధి నివేదికలను వెంటనే ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలని ఆదేశించారు.వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని సూచించారు.ఆహ్వాన పత్రికలు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు,అధికారులందరికీ అందేలా చూడాలని ఆర్‌డిఓ అశోక్ రెడ్డిని,పరేడ్ మైదానంలో తాగునీరు,పారిశుధ్యం చూడాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణను, ప్రథమ చికిత్స, మందులు, అంబులెన్స్ ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్ ను ఆదేశించారు.విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని డీఈఓను,అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఇంటర్మీడియట్ అధికారి దశ్రు నాయక్ ను, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అధికారులు సిబ్బందితో సహా నిర్ణీత సమయానికి హాజరు కావాలన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# అన్న ప్రసాద వితరణ

**ప్రజాపక్షం/నకిరేకల్** :నకిరేకల్ లయన్స్ క్లబ్, నవ్య క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మెయిన్ సెంటర్‌లో అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజసేవలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎన్.సూర్యచందర్ రావు,కార్యదర్శి ఏ.వెంకటేశ్వర్లు,డిస్ట్రిక్ట్ చైర్మెన్ రామ్మోహన్‌రావు,సభ్యులు దామరాజు సూర్యకుమార్,నవ్య క్లబ్ అధ్యక్షురాలు డి.పద్మజ,రమాదేవి,కోటగిరి శ్రీదేవి శ్రీనివాస్,మంచుకొండ నర్సయ్య,శివకోటి ఆంజనేయులు రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో పోరాటం ఆగదు



**ప్రజాపక్షం/నకిరేకల్** : ఆశా కార్యకర్తల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడితే వారి పోరాటం ఆగిపోదని బి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని చందుపట్లలో బిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్‌తో పాటు ఆశా సంఘం జిల్లా నాయకులు దేప పద్మ,చెవుగొని ఇందిరలను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని,ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అరెస్టులు,నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, సమస్యలు తేలే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

# పోషణ మాస ఉత్సవాలు



**ప్రజాపక్షం/నకిరేకల్** : మండలంలోని నెల్లిబండ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు,చిన్నారులు రోజువారీ ఆహారంలో పౌష్టికాహారాన్ని భాగం చేసుకోవాలని సూచించారు. సరైన పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.అనంతరం అంగన్వాడి టీచర్ సుభాషిని, పాఠశాల ఉపాధ్యాయురాలు కోకిల అంగన్వాడీ సిబ్బంది గర్భిణులకు, బాలింతలకు పోషకాహార విశిష్టతను వివరించారు.ఈకార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు,ఆయా సిబ్బంది పాల్గొన్నారు.

# తహసీల్దార్‌కు బిజెపి ఆధ్వర్యంలో వినతి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ పి యశ్వంత్ రాజ్ కు తెలంగాణ విమోచన సప్త సంకల్పాలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుడిగే సైదులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన,రజాకార్ల దురాగతాల నుండి సెప్టెంబర్ 17న తెలంగాణకు విముక్తి లభించిందని, అమరవీరుల త్యాగాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా నాయకులు జిల్లా డాకయ్య, తాటికొండ రామ్మూర్తి,నిర్మల లక్ష్మయ్య,పుట్ట వెంకన్న,మండల ప్రధాన కార్యదర్శులు దొడ్డున శంకర్,ఉప్పల నాగరాజు,వేముల విజయ్ పాల్గొన్నారు.